సాక్షి తిరుపతి

బుధవారం। 8। జనవరి। 2025



పక్షుల పండుగ.. ఏర్పాట్లు మెండుగా!
ఫ్లెమింగో ఫెస్టివల్స్‌కు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. పర్యాటకులను ఆకర్షించే విధంగా స్టాల్స్ సిద్ధమవుతున్నాయి. - IIలో



రక్తమోడిన జాతీయ రహదారి
565 జాతీయ రహదారి రక్తమోడింది. వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. - IIలో



అనారోగ్యమా.. కొట్టి చంపేశాడా?
నాయుడుపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై ఓ బాలింత అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం విషాదాన్ని నింపింది. - IIలో

న్యూస్‌రీల్

తూకాలు తగ్గిస్తే చర్యలు



శేషాచలం రాజు, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి

తిరుపతి అర్బన్: రేషన్ డీలర్లు బియ్యం పంపిణీలో తూకాలు తగ్గిస్తే చర్యలు తప్పవని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శేషాచలంరాజు హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గిడ్డంగుల నుంచే తూకాలు తక్కువగా వచ్చాయంటూ కార్డుదారులకు తగ్గిస్తే ఊరుకోమన్నారు. మనిషికి 4 కిలోల చొప్పున వారికి ఇవ్వాల్సిన బియ్యాన్ని అందించాలని చెప్పారు. బియ్యం ఉచితంగా ఇవ్వాలని, కంది పప్పు కేజీ రూ.65, చక్కెర అర కిలో రూ.17 లెక్కన కార్డుదారులకు అందించాలన్నారు. జనవరి 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సరుకులు ఇవ్వాలని చెప్పారు. జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్లను త్వరలో భర్తీ చేస్తామన్నారు.

ఎర్రచందనంపై పటిష్ట నిఘా



చర్చిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

తిరుపతి మంగళం : ఎర్రచందనం అక్రమంగా తరలిపోకుండా పటిష్ట నిఘా పెట్టాలని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ అటవీ, టాస్క్‌ఫోర్స్ అధికారులను ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు మంగళవారం అటవీ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పెంచలకోన, సోమశిల, లంకమల అటవీ ప్రాంతాలలో పర్యటించారు. పెంచలకోన, బద్వేలు, సిద్ధవటం, రైల్వే కోడూరులలో ఈ సమావేశాలను సోమ, మంగళవారాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఎస్పీ మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లర్లు అక్రమ రవాణాకు ఉపయోగించే ఎంట్రీ, ఎగ్జిట్, లోడింగ్ పాయింట్లు వద్ద నిఘా పటిష్టం చేయాలన్నారు. అటవీశాఖ చెక్ పోస్టులలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. భవిష్యత్తులో టాస్క్ ఫోర్స్ అటవీ శాఖతో కలసి ప్రత్యేక మాస్ కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. డీఎస్పీలు జీ.బాలిరెడ్డి, వీ.శ్రీనివాసులురెడ్డి, ఏసీఎఫ్ జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ముగియనున్న రెవెన్యూ సదస్సులు

తిరుపతి అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రెవెన్యూ సదస్సులు ఆ స్థాయిలో ముందుకు సాగలేదు. గత డిసెంబర్ 6న జిల్లా వ్యాప్తంగా 1,051 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులకు శ్రీకారం చుట్టారు. బుధవారంతో ఇవి ముగియనున్నాయి. ఇప్పటి వరకు 16,310 అర్జీలు వివిధ సమస్యలపై అధికారులకు అందాయి. వీటిలో 90శాతం అర్జీలు భూ సమస్యలపైనే ఉన్నాయి.

గొబ్బిదేవతకు పుర ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని గొబ్బిదేవతకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు దర్శించుకున్నారు.

ఎస్పీడబ్ల్యూ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ: బ్రెయిలీ జయంతి సందర్భంగా తిరుపతి బ్రెయిలీ హోం ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు జిల్లా స్థాయిలో పలు పోటీలను నిర్వహించారు. పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు బ్రెయిలీ లిపితో కూడిన చదరంగం బోర్డుపై తమ సత్తా చాటి విజేతలుగా నిలిచారు. అలాగే డిస్కస్‌త్రో, రన్నింగ్, షాట్‌పుట్ తదితర పోటీలలో సైతం ప్రతిభ కనబరచి బహుమతులను అందుకున్నారు. విజేతలను ప్రిన్సిపల్ డాక్టర్ భద్రమణి, అధ్యాపకులు మంగళవారం అభినందించారు.

నేడు క్రిస్ సిటీకి శంకుస్థాపన

తిరుపతి అర్బన్: ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు బుధవారం విశాఖపట్నం నుంచి వర్చువల్ పద్ధతిలో జిల్లాలోని క్రిస్ సిటీకి చెందిన పలు పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు మంగళవారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా కృష్ణపట్నం ఇండస్ట్రియల్ నోడ్‌లో భాగంగా పలు పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు వివరించారు. అలాగే చిల్లకూరు మండలం, తమ్మినపట్నం తూర్పు కనుపూరు గ్రామాల్లో, కోట మండలం, కొత్తపట్నం, సిద్ధవరం గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తార పేర్కొన్నారు. పునర్వినియోగ నీటి నెట్‌వర్క్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, అంతర్గత సబ్ స్టేషన్లను అభివృద్ధి చేసే ప్రణాళికలకు శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు.

మూర్తిరెడ్డిపాళెం వద్ద స్వర్ణముఖి ప్రవహిస్తున్నా లెక్కచేయకుండా ఇసుక తవ్వకాలు



స్వర్ణముఖి.. సర్వం లూటీ

నాయుడుపేటలో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని స్వర్ణముఖి నదిని లూటీ చేస్తున్నారు. రాత్రి పగలు తేడాలేకుండా యంత్రాలు పెట్టి ఎక్కడ పడితే అక్కడ తవ్వేస్తున్నారు. వర్షాలప్పుడు గ్రామాలను ముంచెత్తకుండా స్వర్ణముఖి నదికి ఏర్పాటు చేసిన పొర్లు కట్టలను సైతం ధ్వంసం చేస్తున్నారు. ఎమ్మెల్యే తండ్రితోపాటు కూటమి నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూసేందుకు కూడా జంకుతున్నారంటే అక్కడ ఏ స్థాయిలో విధ్వంసం జరుగుతోందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు చర్చించుకుంటున్నారు.

- యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు
- పొర్లు కట్టలను తెగ్గొట్టి విధ్వంసం
- స్వగ్రామంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే తండ్రి నెలవల అరాచకాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: నాయుడుపేట సమీపంలో స్వర్ణముఖి నదిని కూటమి పార్టీలకు చెందిన ఇసుకాసురులు కుళ్ల బొడిచేస్తున్నారు. పొర్లు కట్టలను ఎక్కడికక్కడ తెగ్గొట్టి విధ్వంసం సృష్టిస్తున్నారు. రైతులకు వరప్రసాదినిగా ఉన్న స్వర్ణముఖిలో విచ్చలవిడిగా తవ్వకాలు నిర్వహిస్తూ నదిలో ఇసుక రేణువు లేకుండా తరలిస్తున్నారు. స్థానికంగా నిర్మాణాలకు మినహా ఇసుక తరలింపు చేపట్టరాదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఉత్తర్వులిచ్చినా ఇసుక స్మగ్లర్లు లెక్క చేయడం లేదు. అక్రమంగా తమిళనాడు సరిహద్దులు దాకా తరలిస్తున్నారు. తిరుపతి జిల్లాలో స్వర్ణముఖి జన్మ స్థలమైన చంద్రగిరి నుంచి వాకాడు మండలంలో సముద్రంలో కలిసే వరకు తవ్వేస్తూ నదికి గర్భ శోకాన్ని కలిగిస్తున్నారు. చంద్రగిరి, తిరుపతి, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, పెళ్లకూరు, నాయుడుపేట, చిట్టమూరు, వాకాడు మండలాల పరిధిలో యథేచ్ఛగా తవ్వేస్తూ నదిని ఎడారిగా మారుస్తున్నారు.

రోజూ టన్నుల కొద్దీ తవ్వకాలు

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సూళ్లూరుపేట వద్ద కాళంగి నదిని గుల్ల చేసేశారు. స్వర్ణముఖి నదిలో ఇదే తరహాలోనే తవ్వేస్తున్నారు. రోజూ టన్నుల కొద్దీ ఇసుక తవ్వకాలు చేస్తుండడంతో కొద్ది రోజులకు ఈ నదిలో కూడా ఇసుక కరువయ్యే ప్రమాదం లేకపోలేదు. ఒకవైపు నది ప్రవహిస్తుంటే మరోవైపు జేసీబీలు, హిటాచీలు పెట్టి ఇసుకను తవ్వేస్తున్నారు. ముఖ్యంగా నాయుడుపేట పట్టణం సమీపంలోని పలు గ్రామాల వద్ద పొర్లకట్టలను నిట్టనిలువునా తెగ్గొట్టి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు.

కన్నెత్తి చూస్తే ఒట్టు

కూటమి నేతల అండదండలతో అధికార పార్టీ కార్యకర్తలు ఇంటికి రెండు ట్రాక్టర్లు కొనుగోలు చేసి పగలు రాత్రి తేడా లేకుండా తమిళనాడు సరిహద్దుల దాకా ఇసుక తరలిస్తున్నా జాతీయ రహదారిపై ఉన్న నాయుడుపేట, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాలకు చెందిన పోలీసులు కన్నెత్తి చూడడం లేదు. స్వర్ణముఖి ఉప్పొంగిన సమయంలో పరీవాహక గ్రామాలను వరద నీరు ముంచెత్తకుండా రక్షణ కల్పించేందుకు ప్రజాధనం వెచ్చించి నిర్మించిన పొర్లు కట్టలను తెగ్గొట్టి విధ్వంసం సృష్టిస్తున్నారు. చిగురుపాడు, భీమవరం, అయ్యపురెడ్డి పాళెం, మర్లపల్లి, అన్నమేడు తదితర గ్రామాలు నది పక్కనే ఉన్నాయి. పొర్లు కట్టలను తెగ్గొడుతుంటే చర్యలు తీసుకోవాల్సిన ఇరిగేషన్ అధికారులు పత్తాలేరు.



ఇసుక తీసుకొచ్చేందుకు వేచి ఉన్న ట్రాక్టర్లు



భీమవరం వద్ద నిల్వ చేసిన ఇసుక



రోడ్డు పక్కనే ఇసుక నిల్వ చేసి హిటాచీలతో టిప్పర్లకు నింపుతున్న దృశ్యం

మాఫియాకు అడ్డాగా నెలవల స్వగ్రామం

ఎమ్మెల్యే తండ్రి స్వగ్రామం వద్ద నది పొర్లు కట్టలను ఇష్టారాజ్యంగా ధ్వంసం చేశారు. నదిలోని ఇసుకను బయటకు తీసుకొచ్చి డంపింగ్ చేస్తున్నారు. ఆ తర్వాత హిటాచీలతో టిప్పర్లకు లోడ్ చేసి శ్రీసిటీలోని పరిశ్రమలకు, తమిళనాడుకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు పొర్లు కట్టలను ధ్వంసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ఎమ్మెల్యే తండ్రి అరాచకం

ఎమ్మెల్యే తండ్రి స్వగ్రామంలో నది పొర్లు కట్టలను ధ్వంసం చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఎంపీ, ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన అరాచకాలపై సొంత పార్టీ నేతల్లోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. శ్రీసిటీలోని పరిశ్రమల పేరుతో తమిళనాడు సరిహద్దు దాకా చేరవేస్తున్నారు. ఆయన అనుచర గణం కూడా ఇదే పనిలో నిమగ్నమైంది. అధికారులు ఎవరైనా ఇసుక వాహనాలను అడ్డుకుంటే ఆయన పేరు చెప్పి బెదిరిస్తున్నారు. నాయుడుపేటలోనే డీఎస్పీ కార్యాలయం ఉన్నా పట్టించుకున్న పాపాన పోలేదు. దీనిపై టీడీపీ నేతలు కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

జేసీబీలతో నదిలోకి రోడ్డు

టీడీపీ హయాంలోనే సూళ్లూరుపేట వద్ద కాళంగి నదిలో ఇసుక లేకుండా గుల్ల చేశారు. స్వర్ణముఖిలో అదే రీతిలో జేసీబీలు, హిటాచీలతో తవ్వేస్తున్నా మైనింగ్ అధికారులు జాడ లేరు. నాయుడుపేట సమీపంలోని ఏల్‌పి సాగరం, బీడీ కాలనీ, చిగురుపాడు, తుమ్మూరు పరిధిలోని మర్లపల్లి, అన్నమేడు, అయ్యప్పరెడ్డి పాళెం, కల్లిపేడు, మూర్తిరెడ్డి పాళెం వద్ద పొర్లు కట్టలను నిట్టనిలువునా తెగ్గొట్టి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. నదిలోకి ట్రాక్టర్లు వెళ్లేందుకు వీలుగా జేసీబీల సాయంతో చదును చేసి రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

ఇంటికి రెండు ట్రాక్టర్లు



కూటమి నాయకుల అండదండలతో మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు ఇంటికి రెండు ట్రాక్టర్లు కొనుగోలు చేసి పగలు, రాత్రి తేడా లేకుండా తమిళనాడు సరిహద్దుల దాకా ఇసుక తరలిస్తున్నారు. నాయుడుపేట, దొరవారి సత్రం, సూళ్లూరుపేట, తడ మండలాలకు చెందిన పోలీసులు కనీసం పట్టించుకోవడమే మానేశారు. ఒకవేళ పట్టుకుంటే ఏదో ఒక నాయకుడి వద్ద నుంచి ఫోన్లు వస్తాయని మిన్నకుండిపోతున్నారు.



తమిళనాడు సరిహద్దుల దాకా తరలించేందుకు ఇసుక సిద్ధం చేసుకున్న ట్రాక్టర్లు

ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపుదాడులు

తిరుపతి క్రైం: తిరుపతిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపు దాడులు నాన్‌స్టాప్‌గా కొనసాగుతున్నాయి. మంగళవారం జాయింట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచందర్ రావు నేతృత్వంలో పది బృందాలుగా ఏర్పడి తిరుపతి మొత్తం జల్లెడ పట్టారు. ఆహారం తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించని రెస్టారెంట్లు, హోటళ్లపై వరుసగా దాడులు చేశారు. నగరంలోని పలు హోటల్స్ పై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో చికెన్, మటన్, ఫిష్‌తో పాటు పన్నీర్ చెడిపోకుండా కెమికల్స్ కలుపుతున్నట్లు గుర్తించారు. రెస్టారెంట్ల నిర్వాహకులు.. ఫార్మలిన్ కలిపిన చేపలు, రొయ్యలు ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరలకు దిగుమతి చేసుకుంటున్నట్లు గుర్తించారు. 16 హోటళ్లకు సంబంధించి పూర్తి స్థాయిలో శ్యాంపిల్స్‌ను సేకరించారు. అదేవిధంగా 10 హోటళ్లలో అపరి శుభ్రంగా ఉన్నందుకుగాను నోటీసులు జారీచేశారు. వంటకాల్లో సింథటిక్ కలర్లు కలిపిన అల్లం, వెల్లుల్లి పేస్ట్ వాడుతున్నట్లు నిర్ధారించారు.



నగరంలోని హోటల్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

ఉపేక్షించేది లేదు

ఈ దాడులు ఇంకా కొనసాగుతాయని తిరుపతిలో ఉన్న ప్రతి హోటల్, రెస్టారెంట్లలో కూడా దాడులు నిర్వహిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించే విధంగా ప్రతి ఒక్కరికీ ఆదేశాలు జారీ చేశామన్నారు.

భక్తులకు మెరుగైన సేవలు

తిరుపతి సిటీ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు బాధ్యతాయుతంగా మెరుగైన సేవలు అందించాలని టీటీడీ జేఈవో గౌతమి సూచించారు. డిప్యుటేషన్‌పై రానున్న సిబ్బందికి శ్వేత భవనంలో జరిగిన శిక్షణలో ఆమె తిరుపతి జిల్లా ఎస్పీతో కలసి పాల్గొని పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ క్యూలలోని భక్తులకు సంయమనంతో టోకెన్లు జారీ చేయాలని, భక్తుల పట్ల క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. టోకెన్లు జారీకి కావాల్సిన మౌళిక సదుపాయాలైన కంప్యూటర్లు, ప్రింటర్లు, కెమెరాలు, ఆధార్ కార్డు గుర్తించేలా తదితర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. భక్తుల సౌకర్యం మేరకు క్యూలు, బారికేడ్లు, మంచినీరు, మరుగుదొడ్లు తదితర ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి ఆమె తిరుపతిలోని టోకెన్లు జారీ కేంద్రాల్లోని కౌంటర్లను తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ, తిరుపతి, తిరుమలలోని కౌంటర్లలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.



ఎస్పీతో కలిసి టోకెన్ కౌంటర్లను పరిశీలిస్తున్న జేఈఓ గౌతమి

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 54,180 మంది స్వామివారిని దర్శించుకోగా 17,889 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.20 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

విజనరీ భజన!



కుప్పానికి వచ్చిన ప్రతి సారీ చంద్రబాబునాయుడు అవే హామీలు.. అవే మాటలతో గారడీ చేస్తున్నారు. దాదాపు 35 ఏళ్లుగా కుప్పం ఎమ్మెల్యేగా గెలిపిస్తున్నా ఆయన తన నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధిని చేయలేకపోయారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిని చేసినా కుప్పానికి కనీసం తాగు, సాగునీరు కూడా ఇవ్వలేక పోయారు. గతంలో విమానాశ్రయమంటూ ఊదరగొట్టారు. ఇజ్రాయిల్ వ్యవసాయమని నమ్మించి వంచించారు. ఇప్పుడు విమానాల రిపేర్లు చేసే పరిశ్రమ వస్తుందని, సేంద్రియ వ్యవసాయాన్ని తీసుకొస్తామని వరాల వాన కురిపించారు. ఆయన బురిడీ మాటలు నమ్మలేమని కుప్పం ప్రజలు చర్చించుకుంటున్నారు.

బాబు విజన్ మారింది

- 2020 నుంచి 2047కు వెళ్లిన చంద్రన్న విజన్
- 1995 నుంచి అవే మాటలు..అవే హామీలు
- నాడు హంద్రీ నీరు అన్నారు.. నేడు గోదావరి అంటున్నారు
- కుప్పం విమానాశ్రయం శంకుస్థాపనకే పరిమితం
- ఇజ్రాయిల్ సేద్యం పాయె... ఆర్గానిక్ సేద్యం వచ్చే
- కుప్పానికి 35 ఏళ్లుగా అవే వరాలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: సీఎం చంద్రబాబు విజనరీ విని కుప్పం ప్రజలు నవ్వుకుంటున్నారు. ఓట్ల కోసమే తప్ప కుప్పం అభివృద్ధిని ఆయన ఎప్పుడూ కాంక్షించలేదని పలువురు చర్చించుకుంటున్నారు. 1995 సెప్టెంబర్ 1న మొదటి సారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు విజన్ 2020 తీసుకొచ్చారు. ఉమ్మడి రాష్ట్రాన్నే కాకుండా కుప్పాన్ని కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామంటూ నమ్మబలికారు. 2020 అయితే పూర్తయింది కానీ చంద్రబాబు హామీలు మాత్రం అమలుకు నోచుకోలేదు.

పరిశ్రమలెక్కడ బాబూ?

కుప్పం నుంచి ఎన్నికైన చంద్రబాబు నియోజకవర్గ ప్రజలకు మొట్టమొదటి హామీ పరిశ్రమలను తీసుకొచ్చి పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తానని గొప్పగా ప్రకటించారు. జనం కూడా ఆయన మాటలను నమ్మారు. అయితే ఇప్పటికీ చెప్పుకోదగ్గ పరిశ్రమలు తీసుకురాలేకపోయారు. చిన్న తరహా ఆర్‌బీఏ, షాహీ పరిశ్రమలను తీసుకొచ్చారు. వాటిల్లో మొత్తం కలిపితే 2వేల మంది పనిచేస్తుంటారు. అందులోనూ స్థానికేతరులే అధికం. కొన్ని పరిశ్రమలు ఎంఓయులు చేసుకుని, స్థలాలు కేటాయించినా కార్యరూపం దాల్చలేకపోయాయి. తాజాగా మంగళవారం మరో రెండు చిన్న తరహా పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి. ఫలితంగా ఉపాధి కోసం కుప్పం ప్రజలు కర్ణాటక, తమిళనాడు బాట పడుతున్నారు. నిత్యం సుమారు పది వేల మందికి పైగా స్థానికులు ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్తున్నారు.

విమానం పాయె.. రిపేర్లుకొచ్చే!

మూడో సారి చంద్రబాబు సీఎంగా ప్రమాణం స్వీకారం చేసి కుప్పం పర్యటనకు వచ్చిన సందర్భంగా కుప్పంలో విమానాశ్రయం నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. పదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ పునాది రాయి పడలేదు. సోమ, మంగళవారాల్లో కుప్పం పర్యటనల్లో విమానాశ్రయాల రిపేర్ల వ్యవస్థను తీసుకొస్తానని చెప్పడం గమనార్హం.

ఇజ్రాయిల్ పోయింది..ఆర్గానిక్ తెస్తారంట

1999లో రెండో సారి సీఎంగా కుప్పం పర్యటనకు వచ్చిన చంద్రబాబు ఇజ్రాయిల్ వ్యవస్థ ద్వారా బిందు, తుంపర్ల సేద్యం తీసుకొచ్చారు. ఇది అవినీతి, అక్రమాలు చోటు చేసుకోవడంతో ట్రీకే ఆర్ వరకు వచ్చి ఆగిపోయింది. ప్రస్తుత పర్యటనలో పూర్తి స్థాయిలో ఆర్గానిక్ వ్యవసాయం (సేంద్రియ వ్యవసాయం) అంటున్నారు. ఇది ఎంతవరకు కార్యరూపం దాలుస్తుందో అని రైతుల్లో అనుమానాలు నెలకొన్నాయి. ఈ పథకాల్లో మెజార్టీ శాతం టీడీపీ నాయకులకే లబ్ధి జరుగుతుండడంతో సాధారణ రైతులు పెదవి విరుస్తున్నారు.

హామీల కుప్పం

- కుప్పం నియోజకవర్గంలో మండలానికో పరిశ్రమ ఏర్పాటు
- వంద శాతం సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం. నెలకు రూ.30వేల నుంచి రూ.40 వేలు ప్రతి రైతుకూ ఆదాయం.
- ఇంటికో పారిశ్రామిక వేత్తను తయారు చేయడం
- ప్రతి ఒక్కరికీ సొంతిల్లు
- బెంగళూరుకు మించి అభివృద్ధి
- బెంగళూరు పిల్లలు కుప్పంలో చదువు, ఉద్యోగం చేసుకునే విధానం తీసుకురావడం
- ప్రపంచ స్థాయి ఎడ్యుకేషన్
- దేశానికే కుప్పాన్ని ఆదర్శం చేయడం
- రెండున్నరేళ్లల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ అందమైన రోడ్లు

గోదావారి నీరు తెస్తారంట?



కుప్పం నియోజకవర్గంలో తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల అవసరాలను ఓట్లుగా మలచుకునేందుకు చంద్రబాబు తన ప్రతి పర్యటనలోనూ ఆ నది నీరు తెస్తా... ఈ నది నీళ్లు ఇస్తా..? అంటూ మాటలకే పరిమితమవుతున్నారు. తాజాగా గోదావరి నీరు కుప్పానికి తీసుకొస్తానని బీరాలు పలకడం కొసమెరుపు

క్లుప్తంగా

హౌసింగ్ బోర్డు కాలనీలో చోరీ


ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. 1వ పట్టణ పోలీసుల కథనం.. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉండే ఓ కుటుంబం సొంత పనులపై వేరే ఊరికి వెళ్లారు. సోమవారం అర్ధరాత్రి దొంగలు ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకుని చొరబడ్డారు. ఇంట్లో విలువైన పట్టుచీరలు, రూ.20 వేల నగదు దోచుకెళ్లారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన మహిళ మృతి


మృతి చెందిన తులసమ్మ

చంద్రగిరి: ప్రమాదంలో గాయపడిన మహిళా భక్తురాలు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున నరసింగాపురం సమీపంలోని నారాయణ కళాశాల వద్ద కాలినడకన తిరుమలకు వస్తున్న భక్తులను 108 అంబులెన్స్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళా భక్తులు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో అన్నమయ్య జిల్లా, రామసముద్రం మండలం , చింపరపల్లికి చెందిన తులసమ్మ(43) పరిస్థితి విషమంగా ఉండడంతో బంధువులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే తిరిగి ఆమెను తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. 108 అంబులెన్స్ ఢీకొన్న ప్రమాదంలో మృతుల సంఖ్య ముగ్గురికి చేరింది.

ఉద్యాన పంటలపై దృష్టి సారించండి


సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సైదాపురం: ఉద్యాన పంటల సాగుపై అన్నదాతలు దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని ఊటుకూరు, తురిమెర్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు శాస్త్రవేత్తలు తిరుపాలు, ఏడీఏ శ్రీనివాసులు, హెచ్‌ఓ ఆనంద్‌తో కలిసి ఊటుకూరులోని నిమ్మ తోటలను పరిశీలించారు. ఉద్యన పంటల సాగు చేసే రైతులకు ప్రభుత్వం విరివిగా రాయితీలను అందిస్తోందని, ఉపాధి హామీ పథకం ద్వారా నిమ్మ తోటల సాగు చేసుకునే రైతులకు నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. హెచ్‌ఓ ఆనంద్, ఏడీఏ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పంటలను పొందాలంటే పరిమిత ఎరువులను మాత్రమే చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, ఏఓ హైమావతి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

పక్షుల పండుగ.. ఏర్పాట్లు మెండుగా!

- నాలుగు చోట్ల పండుగ ఏర్పాట్లు
- సందర్శకులకు ఇబ్బందులు లేకుండా వసతులు

దొరవారిసత్రం: సూళ్లూరుపేట కేంద్రంగా ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్ (పక్షుల పండుగ) అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలియజేశారు. ఆయన స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఫారెస్ట్, టూరిజం తదితరశాఖల అధికారులతో కలిసి నేలపట్టు పక్షుల కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. మూడు రోజుల పాటు నిర్వహించే పక్షుల పండుగ సమయంలో సందర్శకులు, పర్యాటకుల కోసం వసతులు, సదపాయలు వంటి వాటిపై ఆయా శాఖల అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పండుగ సమయంలో సూళ్లూరుపేట, నేలపట్టు, పులికాట్, బీవీ పాళెం ప్రాంతాలను సందర్శించే సందర్శకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పక్షుల కేంద్రంలో విడిది చేసే విహంగాలను వీక్షించి ఎంతో ఆనందం వక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిరుపయోగంగా మారిన టూరిజం సముదాయాలు పండుగలోపు వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. శ్రీసిటీ సెజ్ ప్రాంతంలోని పరిశ్రమల సహకారంతో పక్షుల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహన, వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.


పక్షుల కేంద్రంలో విడిది చేస్తున్న విదేశీ విహంగాలు

మూడు రోజుల పాటు జరిగే పండుగలో ఎక్కడ కూడా ప్రవేశ రుసుం చెల్లించాల్సిన పనిలేదన్నారు. ఆయన వెంట సూళ్లూరుపేట డీఎఫ్‌ఓ హారిక, జిల్లా టూరిజం అధికారి, వైఎస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీఓ గోవర్ధన, ఎఫ్ఆర్‌ఓ సౌజన్య ఉన్నారు.

రైతుల సమస్యపై స్పందించిన కలెక్టర్

నేలపట్టు పక్షుల కేంద్రం పరిధిలోని అత్తిగుంట, నేరేడుగుంట చెరువులకు చెందిన తూములు మరమ్మతులకు గురికావడంతో సాగు నీరు పంట పొలాలుకు చేరడం లేదని ఆయకట్టు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన తన నిధులు మంజూరు చేస్తానని, ఈపనులు ఎప్పుడు చేస్తారని సంబంధిత ఇరిగేషన్ డీఈ శ్రీధర్‌ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. జూన్‌లో తూముల పనులు పూర్తి చేయించి సాగు నీరు పంట పొలాలకు సక్రమంగా అందేలా చూస్తామని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు.


తూముల దుస్థితిని కలెక్టర్‌కు వివరిస్తున్న ఆయకట్టు రైతులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలు కేంద్రాలుగా జరగనున్న పక్షుల పండుగ ఏర్పాట్లపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. ఫ్లెమింగో ఫెసివల్–2025 నిర్వహణ ఏర్పాట్ల సమీక్షలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని, దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని, తడమండలం భీములవారిపాళెం పడవల రేవును ఆయన ఎమ్మెల్యేతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా ఎగ్జిబిషన్ స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, నేలపట్టు చెరువులో పక్షులను వీక్షించడం, అలాగే అటకానితిప్ప పర్యావరణ విజ్ఞానకేంద్రం సందర్శనలతో పాటు తడ మండలం భీములవారిపాళెం పడవల రేవులో పడవ షికార్ లాంటివి ఏర్పాటు చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. వైల్డ్‌లైఫ్ డీఎఫ్‌ఓ రాధిక, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, తహసీల్దార్ నరసింహులు, ఆర్డీఓ కార్యాలయ డీఏఓ రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పక్షుల పండుగ

తడ: ఫ్లెమింగో ఫెస్టివల్‌ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన బీవీపాళెం పడవల రేవును సందర్శించారు. అనంతరం స్థానిక నాయకులతో మాట్లాడారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా క్రీడా పోటీలు


చెస్ ఆడుతున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల వేదికగా జరుగుతున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. క్రీడల్లో రెండవ రోజు క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, చెస్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పురుషుల 400, 500 మీటర్ల పరుగు పందెంలో గరివిడి విద్యార్థులు విజేతగా నిలిచారు. మహిళా విభాగంలో జావెలింగ్ త్రోలో గరివిడి విద్యార్థిని, షాట్ పుట్‌లో ప్రొద్దుటూరుకు చెందిన విద్యార్థిని గెలుపొందారు. వాలీబాల్ మహిళా విభాగంలో డెయిరీ టెక్నాలజీ కళాశాల ప్రొద్దుటూరు విద్యార్థులు గెలుపొందారు. బాస్కెట్‌బాల్ విభాగంలో తిరుపతి విద్యార్థులు ప్రతిభను చాటారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య పాల్గొన్నారు.

కోలుకున్న కార్మికులు

నారాయణవనం: లకీ ఫోర్ యూ హెర్బల్ ఫ్యాక్టరీ ట్రయల్ రన్‌లో శనివారం అర్ధరాత్రి అస్వస్థతకు గురైన కార్మికులు కోలుకున్నారని యాజమాన్యం తెలిపింది. మంగళవారం ఫ్యాక్టరీ ప్రతినిధి మూర్తి మీడియాతో మాట్లాడారు. అనుకోకుండా ఎక్స్‌ట్రాక్ట్ చాంబర్ నుంచి వ్యర్థాలను బయటకు తీసే వాల్వు రబ్బర్ దారం తెగడంతో ద్వారం తెరుచుకుని పౌడర్ వెదజల్లడంతో ప్రమాదం జరిగిందన్నారు.

అనారోగ్యమా.. కొట్టి చంపేశాడా?

- అనుమానాస్పద స్థితిలో బాలింత మృతి
- నెలల రోజుల పాపను తీసుకుని పరారైనా భర్త
- కేసు నమోదు చేసిన సూళ్లూరుపేట రైల్వే పోలీసులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారమ్ వద్ద ఓ బాలింత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సూళ్లూరుపేట రైల్వే పోలీసులు మంగళవారం గుర్తించారు. సూళ్లూరుపేట రైల్వే ఎస్ఐ వై.చెన్నకేశవ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావులు రైల్వే స్టేషన్‌కు చేరుకుని మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. రైల్వే ఎస్ఐ తెలిపిన మేరకు వివరాలు.. నాయుడుపేట పట్టణంలోని తుమ్మూరు ఎస్టీ ఏటిగట్టు కాలనీ వద్ద నివాసముంటున్న నాగలక్ష్మి(27) మొదటి భర్త ఏడేళ్ల కిందట మృతి చెందాడు. పెనిమేటి కృష్ణయ్య అనే అతన్ని రెండో పెళ్లి చేసుకుంది. ఆమెకు మొదటి భర్త సంతానం 8 ఏళ్ల కుమారుడు శ్రీనివాసులు ఉన్నాడు. నాగలక్ష్మి గత నెల 3వ తేదీన పాపకు జన్మనిచ్చింది. బాలింత అయిన నాగలక్ష్మి ఆరోగ్యం సరిలేక పోవడంతో సోమవారం రాత్రి ఆమె ఇద్దరు పిల్లలును తీసుకుని భర్త కృష్ణయ్యతో కలిసి నెల్లూరుకు వెళ్లేందుకు నాయుడుపేట రైల్వే స్టేషన్‌కు వచ్చారు. రాత్రి రైలు లేక పోవడంతో మంగళవారం ఉదయం వెళ్లేందుకు స్టేషన్ వద్దే ఉండిపోయారు. మంగళవారం ఉదయం నాగలక్ష్మి ఆరోగ్యం మరింత క్షీణించి మృతి చెందినట్లుగా రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. భర్త కృష్ణయ్య రైల్వే పోలీసులు వచ్చేటప్పటికే మృతురాలి పాపను తీసుకుని పరారయ్యాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నాగలక్ష్మి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి భర్త కృష్ణయ్య కోసం రైల్వే పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా నాగలక్ష్మి ఆరోగ్యంగానే ఉందని, భర్త మద్యం సేవించి తరచూ వేధింపులకు గురిచేసేవాడని కాలనీ వాసులు ఆరోపించారు. భర్త కృష్ణయ్య నాగలక్ష్మిని రైల్వే స్టేషన్ వద్ద చంపేసి ఉంటాడని చెబుతున్నారు. ఈ మేరకు పోలీసలు విచారణ చేపట్టారు. ఇదిలావుండగా మృతురాలి కుమారుడు శ్రీనివాసులును ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో సూపర్ వైజర్ ఆశాబేగం గూడూరు బాలసదన్ శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు.


నాగలక్ష్మి మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్ఐ

రోడ్డు ప్రమాదంలో తమిళ కూలీ మృతి


గాయపడిన తనిగవేలు

నారాయణవనం: కుటుంబ పోషణ కోసం చెరుకు నరకడానికి వచ్చిన తమిళనాడు వాసి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. మరో కూలీ తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. ఈ ఘటన మంగళవారం వేకువ జామున మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం.. తమిళనాడు రాష్ట్రం, విల్లుపురానికి చెందిన కొందరు కూలీలు నైనారుకండ్రిగలో చెరుకు నరికేందుకు వచ్చారు. మంగళవారం వేకువ జామున 5.40 గంటల సమయంలో చెరుకును లోడ్ చేయడానికి హైవేలో బస్ షెల్టర్ వద్ద వేచి ఉన్నారు. చెన్నై నుంచి కడపకు వెళుతున్న కంటైనర్ వీరిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో విల్లు పురానికి చెందిన రాజేంద్రన్(45) మృతి చెందగా, మరో కూలీ తనిగవేలు(45) తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన తనిగవేలును చికిత్స నిమిత్తం పుత్తూరు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ శివగండన్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదానికి కారణమైన కంటైనర్

పోలీసుల అదుపులో గంజాయి స్మగ్లర్లు

చిల్లకూరు: గంజాయిని అక్రమంగా కారులో తరలిస్తున్నారనే సమాచారంతో తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసులు బూదనం టోల్ గేట్ వద్ద మంగళవారం మాటు వేశారు. స్మగ్లర్లకు ముందుగానే సమాచారం అందడంతో వారు గూడూరు వైపు వెళ్లిపోగా.. గూడూరు పోలీసులు పోటుపాళెం సర్కిల్ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే గంజాయి ఉన్న కారులోని ఇద్దరు వ్యక్తులు వేగంగా కోట వైపు పరారు కావడంతో వారిని విద్యానగర్ ప్రాంతంలో చేజ్ చేసి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్మగ్లర్లను నాయుడుపేటకు తరలించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. వీరి వద్ద నుంచి సుమారు 78 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

రక్తమోడిన జాతీయ రహదారి

- రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కలువాయి: 565 జాతీయ రహదారి రక్తమోడింది. కలువాయి మండలంలో రెండు వేర్వేరు చోట్ల జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కలువాయి పోలీసుల కథనం.. ఉయ్యాలపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అనంతసాగరం మండలం, లింగంగుంటకు చెందిన చీలిపోగు పవన్‌కుమార్ అలియాస్ చిన్న(25) మృతి చెందాడు. ఇతని దేహం రెండు ముక్కలై, తల పగిలిపోయి, పేగులు బయటపడ్డాయి. వెంకటరెడ్డిపల్లి పెన్నా వంతెన సమీపంలో కారు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న మల్లికా చెన్నకేశవులు(53) తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఇతని స్వగ్రామం రాపూరు మండలం ఆకిలవలస.

అత్తగారింటికి వచ్చి..మృత్యుఒడికి

ఉయ్యాలపల్లి సమీపంలో జరిగిన ప్రమాదంతో మృతి చెందిన చీలిపోగు పవన్‌కుమార్‌ది అనంతసాగరం మండలం, లింగంగుంట గ్రామం. సోమవారం రాత్రి తన అత్తగారి ఊరైన ఉయ్యాలపల్లికి తన తల్లిదండ్రులతో కలిసి వచ్చాడు. మద్యం సేవించి భార్య నందినితో గొడవపడి ఇంట్లో వాళ్లు వద్దని వారిస్తున్నా వినకుండా రాత్రి పది గంటల ప్రాంతంలో అత్త దగ్గరకు వెళ్లి నాన్న అనారోగ్యం గురించి చెప్పి డబ్బు తీసుకువస్తానని వెళ్లాడు. ఉదయం రోడ్డుపై శవమై కనిపించడంతో పవన్‌కుమార్ భార్య నందిని, తల్లిదండ్రులు పెంచలమ్మ, రామయ్య బోరున విలపించారు. మద్యం మత్తులో రోడ్డుపైనే పడిపోవడంతో గుర్తుతెలియని వాహనం తొక్కుకుని వెళ్లి ఉంటుందని చెపుతున్నారు.


ప్రమాద స్థలంలో విలపిస్తున్న పవన్‌కుమార్ తల్లిదండ్రులు, భార్య

తోటకు తిరిగివస్తూ..

వెంకటరెడ్డిపల్లి పెన్నా వంతెన వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మల్లికా చెన్నకేశవులు స్వగ్రామం రాపూరు మండలం, ఆకలివలస. ఇతను అనంతసాగరం మండలం, ఉప్పలపాడు సమీపంలోని ఓ తోటలో కాపలాదారుగా పనిచేస్తుంటాడు. సోమవారం రాత్రి ఆకలివలసలో ఉన్న తన భార్య వద్దకు వెళ్లి తిరిగి తాను కాపలా ఉండే ఉప్పలపాడు సమీపంలోని తోట వద్దకు బైక్‌పై వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. ఈ రెండు మృత దేహాలను పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కలువాయి ఎస్ఐ సుమన్ తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 10 నుంచి 19 వరకు ఇవ్వనున్న దర్శనం టిక్కెట్ల విషయంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. ఆ మేరకు కలెక్టరేట్‌లో ఆయన మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. డీఆర్వో మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం తిరుపతిలోని జీవకోన, ముత్యాలరెడ్డి పల్లి జెడ్పీ హైస్కూళ్లు, రామచంద్ర పుష్కరిణి, రామానాయుడు హైస్కూల్, ఇందిరా మైదానం, శ్రీనివాస కాంప్లెక్స్, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్, బాలాజీ కమ్యూనిటీ హాల్, తిరుమల మొత్తం 9 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కేంద్రాల పర్యవేక్షణకు జిల్లాలోని తొమ్మిది మంది తహసీల్దార్లను నియమించినట్లు చెప్పారు. భక్తులకు సులభతరంగా ఇబ్బందులకు గురి కాకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గ్రీవెన్స్ అర్జీలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోస్మాండ్ పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.


పలు సూచనలు చేస్తున్న డీఆర్వో నరసింహులు

ప్రక్షాళన తప్పదు

దొరవారిసత్రం: 'దొరవారిసత్రంలోని జాతీయ ఉపాధి హామీ పథకం శాఖకు చెందిన సిబ్బంది నుంచి అధికారుల వరకు ప్రక్షాళన చెయ్యందే మండలం బాగుపడదు, ఉపాధి పనులు సక్రమంగా జరగవు..' అంటూ పీడీ శ్రీనివాసప్రసాద్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. స్థానిక మండలం పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజిక తనిఖీ బృందం సభ్యులు పంచాయతీల వారీగా టీఏ, ఎఫ్ఏ, ఈసీలు చేసి లోటు పాట్లపై నివేదికనలు చదివి వినింపించారు. అధికంగా గ్రామాల్లో చేసిన పనులు సక్రమంగా లేకపోవడంతో కొలతల్లో అవకతవకలు, కూలీలకు నగదుల చెల్లింపుల్లో లోటు పాట్లు, మస్టర్ విషయంలో ఎఫ్ఏల చేతి వాటం వంటివి వెలుగులోకి వచ్చాయి. అంతేకాకుండా పీఆర్, హౌసింగ్ పరంగా బిల్లులు చెల్లింపుల్లో పలు అంశాలు బయటపడ్డాయి. వీటిపై సంబంధిత అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో పీడీ మండిపడ్డారు. అధికంగా వేణుంబాకం, తనియాలి, నేలపట్టు, శ్రీధనమల్లి, పూలతోట, పోలిరెడ్డిపాళెం తదితర పంచాయతీల్లో ఇప్పటి వరకు జరిగిన వివిధ ఉపాధి పనుల్లో కొలతు సక్రమంగా లేకపోవడం, బిల్లులు చెల్లింపుల్లో పలు అవకతవక ఉండడంతో ఆయా ఎఫ్ఏలను, టీఏలను వెంటనే సస్పెండ్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక్కడ ఉన్న అందర్నీ ప్రక్షాళన చెయ్యందే మండలం బాగుపడదని అసహనం వ్యక్తం చేశారు. పలువురు ఎఫ్ఏలు, టీఏ నుంచి భారీగా రికవరీ చేస్తున్నట్లు పీడీ తెలిపారు. ఈ సమావేశంలో డీఈఓ శివయ్య, క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీనివాసులు, ఎస్ఆర్పీ రవి, ఎంపీడీఓ గోవర్ధన, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఏపీఓలు భాస్కరయ్య, ఉషా పాల్గొన్నారు.


సామాజిక తనిఖీలో లోటుపాట్లను వివరిస్తున్న సిబ్బంది

ధైర్యంగా ఎదుర్కొందాం!

వెంకటగిరి రూరల్: అతివృష్టి, అనావృష్టి కారణంగా ఏర్పడే విపత్కర పరిస్థితులను ధైర్యంగా ఎదర్కోవాలని తొమ్మిదవ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఆనంద్ కన్నా వెల్లడించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ఏపీఎస్పీఆర్ఎఫ్ డిసిస్టర్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదాల నివారణపై బెటాలియన్ సిబ్బంది విన్యాసాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆర్ఎస్ఎస్ఐ ప్రశాంత్, బెటాలియన్ సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, పాఠశాల హెచ్ఎం స్వర్ణలత పాల్గొన్నారు.


ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న కమాండెంట్ ఆనంద్

హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్ట్

తిరుపతి క్రైం : జయశ్యామ్ థియేటర్ సమీపంలోని భారతి వైన్స్ వద్ద గత ఆదివారం మధ్యాహ్నం జరిగిన హత్యాయత్నం కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు మేరకు.. ఈనెల 5వ తేదీన నగరంలో నివాసం ఉంటున్న కందం సాయికుమార్ పై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. పాత కలహాలతో సాయికుమార్‌ని మద్యం షాపునకు పిలిపించి తోటి స్నేహితులే హత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి కార్వేటినగరం, బీసీ కాలనీకి చెందిన ధనవేలు, కర్ణాటక రాష్ట్రం, చిక్కబల్లాపూర్ జిల్లా, చేలూరుకు చెందిన కృష్ణ శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన రేపరోల్ల చందు, తమిళనాడు రాష్ట్రం చెన్నై పట్టణంలోని రెట్టేరి వీధికి చెందిన మహాప్రభు, చెన్నై పట్టణంలోని రెడ్ హిల్స్‌కు చెందిన తమిళ అరసన్, అన్నమయ్య జిల్లా, చిన్నమండెం మండలం, మల్లూరు గ్రామానికి చెందిన దేరంగుల శివగా గుర్తించి తిరుపతి సెంట్రల్ బస్ స్టేషన్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో సీఐ రామకృష్ణ, ఎస్ఐలు నరసింహ, బాలకృష్ణ చేసిన కృషిని ఆయన అభినందించారు.


నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ వెంకట్‌నారాయణ

భక్తుల భద్రతకు ప్రాధాన్యం

తిరుమల : భక్తుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం తిరుమల ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశం నిర్వహించారు. భక్తులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఘాట్‌రోడ్‌లో ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో బస్సులు నడుస్తాయని, ఆ మేరకు సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. డ్రైవర్లు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Services
కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్ట్‌ల, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి DMA స్వాగతం. జీతం + కమీషన్. ✆ 9671637906.

Wanted
ఆఫీస్ బాయ్&ప్యాకింగ్ హెల్పర్&డెలివరీ లిఫ్టింగ్ & సెక్యూరిటీ గార్డ్స్& సెక్యూరిటీ సూపర్ వైజర్& హౌస్ కీపింగ్ స్త్రీలు తిరుపతిలో పనిచేయుటకు కావలెను. 99891 39239, 81791 96300.

Wanted Position: Female Receptionist, Location: Fire and Feast Restaurant, Tirupati, Age: 20-25 Yrs. hr@fireandfeast.in, ✆ 8123459658.

కేర్‌టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో పేషెంట్లను ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు ప్రముఖ హోమ్‌కేర్ సంస్థకు కావలెను. మంచి జీతం+వ+ భో ✆ 91608 35559, 78158 35561

కష్టపడేవారు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు, ఫ్రీ రూం+భోజనం.HYD. 6309020999

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ : 18K. Ph: 9640400073, 9160900024

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రత్యుత్తరం ఇవ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

లైను రేట్లు ప్రకటనకు రూ. 375/- ప్రతి ప్రకటనపై
అదనపు లైనుకు రూ.:90/- G.S.T 5% అదనం
CONTACT : 9440166091, 9951602970

STATE BANK OF INDIA
RBO-1, TIRUPATI
REQUIREMENT OF PREMISES
SBI invites offers for leasing of premises for opening of its CHERLOPALLI NEW Branch, Tirupati District, AP. The premises should have about 3000-3200 Sq. ft. carpet area with good frontage, adequate parking space for vehicles with all amenities. Bank prefers ground floor premises.
Interested parties may download the proforma for Technical & Price bids from SBI website "https://bank.sbi/portal/web/ home/procurementnews" and submit the same in separate sealed covers super scribed **"Technical Bid" and "Price Bid"** with name and address of the tenderer's on or before 3.00PM hours. On 23.01.2025.
Bank reserves the right to reject any/all offer(s) without assigning any reasons thereof.
Regional Manager, SBI, RBO-1, TIRUPATI.